క్లుప్తంగా

గుడ్ మార్నింగ్ మాచర్ల



మాచర్ల: గుడ్ మార్నింగ్ మాచర్ల కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని రింగ్ రోడ్డు, ఇతర ప్రాంతాల్లో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు పర్యటించారు. ఉదయం 10 గంటల వరకు పారిశుద్ధ్య పనులను పరిశీలించి, ఆయా ప్రాంత ప్రజల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. పారిశుద్ధ్య సమస్య ఉన్న ప్రాంతాల వివరాలు కమిషనర్ వేణుబాబు దృష్టికి తీసుకెళ్లారు. పారిశుద్ధ్య పనుల ఇన్‌స్పెక్టర్ పి.రాజ ఆయా ప్రాంతాలను పర్యవేక్షించి తగిన చర్యలు చేపట్టారు.

అర్జీలు రాలేదు

మాచర్ల: రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ తొలగిపోవడంతో సోమవారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ డి.వేణుబాబు ప్రజల నుంచి అర్జీలు రాలేదని తెలిపారు.

మాజీ ఎంపీపీకి మాతృవియోగం



మాచర్ల: మాజీ ఎంపీపీ కొర్రా సామ్య నాయక్ మాతృమూర్తి కొర్రా మసురుబాయి సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ కె.కోటిరెడ్డి, జెడ్పీటీసీ మనుస్వామి, పార్టీ సీనియర్ నాయకులు హనిమిరెడ్డి, ఉమ్మడి గుంటూరు జిల్లా గిరిజన సంఘ అధ్యక్షుడు నూనావత్ రంగనాయకులు, బీసీ సంఘ నాయకుడు పెద్దిరాజులు మృతదేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం సాంబా నాయక్‌ను పరామర్శించి, ధైర్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సూచనల మేరకు సాంబా నాయక్ కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణకు తరలిరండి



కారెంపూడి: ఒడ్డే ఓబన్న విగ్రహావిష్కరణకు తరలి రావాలని కోరుతూ వడ్డెర సంఘ నాయకులు సోమవారం కారెంపూడి మండలంలో పర్యటించారు. మండలంలోని చినగార్లపాడు, చింతపల్లి గ్రామాలలో పర్యటించారు. ఈ నెల 16న మాచర్లలో జరగనున్న వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణకు తరలి రావాలని ఆహ్వాన పత్రికలు పంపిణీ చేశారు. మాచర్ల పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, వడ్డెర సంఘ నాయకులు పాల్గొన్నారు.

మహిళా అభ్యున్నతికి పాటుపడాలి



మాచవరం: మహిళా అభ్యున్నతికి అందరూ పాటుపడాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్కే జమాల్ అన్నారు. మండల కేంద్రమైన మాచవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎం.జగన్నాథం, నాయకులు ఆదినారాయణ, హెచ్‌ఎం సురేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాపర్ వైరు చోరీ నిందితుడికి రిమాండ్

నాదెండ్ల: చిలకలూరిపేట నూతన బైపాస్‌రోడ్డులో గణపవరం వద్ద జరిగిన చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఫిబ్రవరిలో బైపాస్ రోడ్డులో 10 వేల మీటర్ల సోలార్ కాపర్ వైరు చోరీకి గురైనట్లు బాధిత సంస్థ ఎండీ నాగరాజు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళగిరి గ్రంథాలయంపేటకు చెందిన అనుమల వాసును అరెస్టు చేసి చోరీకి గురైన 10 వేల మీటర్ల కాపర్‌వైరును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని చిలకలూరిపేట కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించగా, నిందితుడిని నరసరావుపేట సబ్‌జైలుకు తరలించారు.

ప్రజల భాగస్వామ్యంతో సర్వే

నూజెండ్ల: పీ–4 సర్వేను ప్రజల భాగస్వామ్యంతో చేపట్టాలని ఎంపీడీవో పావులూరి ఉమాదేవి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీ–4 సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మార్గదర్శకాలు వివరించారు.

ఇంకెన్నాళ్లీ నిరీక్షణ



పిడుగురాళ్ల జానపాడు రోడ్డులో రైల్వే ట్రాక్ వద్ద నిరీక్షిస్తున్న వాహనదారులు

- ఆగిపోయిన జానపాడు రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు
- గత ప్రభుత్వంలో రూ.51 కోట్ల నిధులు మంజూరు
- శంకుస్థాపన చేసిన మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- ఏడాదిన్నర దాటినా పట్టించుకోని కూటమి ప్రభుత్వం

పిడుగురాళ్ల: నిత్యం వాహనాల రాకపోకలతో పిడుగురాళ్ల పట్టణంలోని జానపాడు రోడ్డు రద్దీగా ఉంటుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.51 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. బ్రిడ్జికి ఇరువైపులా సర్వీస్ రోడ్డు నిర్మించడానికి కూడా నిధులు మంజూరు అయ్యాయి. అప్పటి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి 2024 జనవరి 4న బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. బ్రిడ్జి నిర్మించినడానికి గతంలోనే అన్ని అనుమతులు వచ్చాయి. తిరిగి మరలా కొన్ని అనుమతులు రాలేదంటూ రోడ్ల భవనాల శాఖ అధికారులు పనులను ప్రారంభించకుండా వదిలేశారు.

గేటు వేస్తే..

రైళ్ల రాకపోకలు అధికం కావడంతో జానపాడు గేటు వేస్తే వాహనాలు నిత్యం నిలిచిపోతున్నాయి. గూడ్స్ రైళ్లు రోజుకు 10, ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు సుమారు 34 రాకపోకలు సాగిస్తుంటాయి. రైలు వచ్చిన ప్రతి సారి సుమారు 20 నిమిషాల పాటు గేటు మూసివేసి ఉండటం, అదే క్రాసింగ్ రైళ్లు వచ్చే సమయంలో సుమారు అర్ధ గంటపాటు వాహనదారులు రైల్వే గేటు వద్ద నిరీక్షిస్తున్నారు.



2024లో ఏర్పాటు చేసిన శంకుస్థాపన శిలాఫలకం

రైల్వే బ్రిడ్జి నిర్మాణం ఎలా...

జానపాడు రోడ్డులోని రైల్వే బ్రిడ్జి నిర్మాణం పనులు పొడవు 742 మీటర్లు పొడవు, అలాగే 18 పిల్లర్లు నిర్మిస్తారు. అందులో ఐలాండ్ సెంటర్ నుంచి రైల్వే గేటు వరకు 8 పిల్లర్లు, రైల్వే గేటు నుంచి జానపాడు గ్రామం వైపు 10 పిల్లర్లు నిర్మిస్తారు. పిల్లర్ల మధ్యలో 20 మీటర్ల దూరం ఉంటుంది. ఒక్కొక్క పిల్లరు 3 మీటర్ల వెడల్పులో నిర్మిస్తారు. రైల్వే బ్రిడ్జి వెడల్పు 18 మీటర్లు, అలాగే రెండు వైపులా సర్వీస్ రోడ్డు కోసం 5.50 మీటర్లతో సర్వీస్ రోడ్డు నిర్మిస్తారు. గత సంవత్సరంలో శంకుస్థాపన చేసినా.. నేటికి 15 నెలలు పూర్తి అయినప్పటికీ పనులు కాకపోవటంతో ప్రజలు నిరాశతో ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జానపాడు రోడ్డు నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

యువత పోరును విజయవంతం చేయండి

పిడుగురాళ్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో యువత పోరు కార్యక్రమం ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్నట్లు పిడుగురాళ్ల పట్టణ, మండల కన్వీనర్లు చింతా వెంకట రామారావు, చల్లా పిచ్చిరెడ్డి తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం యువత పోరు వాల్‌పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భారీగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఈ నెల 12న వైఎస్సార్ సీపీ ఆవిర్భవ దినోత్సవం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం పట్టణంలోని అంజిరెడ్డి హాస్పిటల్ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరుగుతుందన్నారు. అనంతరం అక్కడ నుంచి నర్సరావుపేటకు యువత పోరు కార్యక్రమానికి భారీ ర్యాలీగా అందరు కలిసికట్టుగా వెళ్లాలని ఈ సందర్భంగా వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చింతా సుబ్బారెడ్డి, పిడుగురాళ్ల యూత్ కన్వీనర్ మందా సుదీర్‌బాబు, దాచేపల్లి పట్టణ కన్వీనర్ టమాటా సుభాని, దాచేపల్లి మండల కన్వీనర్ కోటా కృష్ణ, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రెంటచింతల: విద్యార్థులను, యువతను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాచర్ల మాజీ శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నేతృత్వంలో ఈ నెల 12న నర్సరావుపేటలో తలపెట్టిన యువత పోరుకు మండలంలోని వైఎస్సార్ శ్రేణులు భారీగా తరలిరావాలని పార్టీ మండలాధ్యక్షుడు గొట్టం బ్రహ్మారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం రెంటచింతలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ, ఫీజ్ రీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో విడుదల చేయకుండా విద్యార్థులను, ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా యువతను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ఈ యువత పోరును పార్టీ తలపెట్టినట్లు వెల్లడించారు.

ముగిసిన ప్రసన్నాంజనేయస్వామి మండల పూజలు



కారెంపూడి: స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో మాఘ మాసం మాఘ పురాణాన్ని పురస్కరించుకుని గత 40 రోజులుగా జరుగుతున్న ప్రత్యేక పూజా కార్యక్రమాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా స్వామికి పంచామృతాభిషేకాలు, నవ కలశ పూజలు, నాగవల్లి పూజలు. ఆకు పూజలు నిర్వహించారు. మహిళలు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో పట్టణ ఆర్య వైశ్య సంఘ అధ్యక్షుడు చీతిరాల వెంకట కోటేశ్వర రావు, సంఘ పెద్దలు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు కొమండూరి సత్య నారాయణాచార్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

సమస్యలకు గ్రామ స్థాయిలోనే పరిష్కారం

కారెంపూడి: తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం వేదిక (గ్రీవెన్స్ డే)ను మండల అధికారులు సోమవారం నిర్వహించారు. గ్రీవెన్స్‌కు మొత్తం మూడు అర్జీలు వచ్చాయని తెలిపారు. డీకే పట్టా కోసం, నివేశన స్థలం మంజూరుకు అర్జీలు వచ్చాయని తహసీల్దారు ఆర్.వెంకటేశ్వర్లు నాయక్ చెప్పారు. ప్రజా సమస్యలను ఎక్కడికక్కడ గ్రామ సచివాలయాల పరిధిలోనే పరిష్కారం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎవరూ కూడా సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జి శ్రీనివాస రెడ్డి, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



కారెంపూడి: స్థానిక పీహెచ్‌సీకి సోమవారం ఆరోగ్య పరీక్షల కోసం తరలి వచ్చిన గర్భిణులకు దాతలు పౌష్టికాహారం అందించారు. కారెంపూడికి చెందిన ఆశం నరసింహారెడ్డి, లీలావతి, జడ్డు లక్ష్మారెడ్డి తదితరులు గర్భిణులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎం.రమ్య పాల్గొన్నారు. భవిరిశెట్టి రామారావు, వాసవి సేవా దళ్ సభ్యులు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

యడ్లపాడు: ఫాల్గుణ పౌర్ణమి మహోత్సవాన్ని పురస్కరించుకుని త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం వైభవంగా నిర్వహించారు. యోగి ప్రబోధానంద యోగ పీఠం స్థాపించిన ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరస్వామి రచించిన 100 ఆధ్యాత్మిక గ్రంథాలను పలు గ్రామాల ప్రజలకు పరిచయం చేశారు. మండలంలోని వంకాయలపాడు, బోయపాలెం, ఉన్నవ, కారుచోల గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం కలిగించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి –ఇందూ జ్ఞానవేదిక, నరసరావుపేట కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం – ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక – నరసరావుపేట కమిటీ అధ్యక్షుడు ఘడియం పెద్దరెడ్డి, సభ్యులు ఎలిశెట్టి రమేష్, పగడాల రామయ్య, చల్లగుండ్ల భాస్కరరావు, కోవూరి చిన్న వెంకటేశ్వర్లు, తవిటి అమరలింగయ్య, పెరుగు ఏడుకొండలు, కుంచాల చిన్నవెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉన్నవ గ్రామంలో ప్రచారం చేస్తున్న వేదిక సభ్యులు

దాచేపల్లి తహసీల్దారుగా కుటుంబరావు



దాచేపల్లి: మండల తహసీల్దారుగా వై.వి.కుటుంబారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. గురజాల ఆర్డీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆయన దాచేపల్లి తహసీల్దారుగా బదిలీపై వచ్చారు. కార్యాలయం సిబ్బందితో సమావేశమై రెవెన్యూ సమస్యలపై చర్చించారు. రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి తహసీల్దారుగా పిడుగురాళ్ల తహసీల్దారు పెదబాబు ఉన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రంలో తనిఖీ

దాచేపల్లి: నారాయణపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామినేషన్ జిల్లా ప్రత్యేక అధికారి కుంభా వేణు, జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ మెంబర్ వెంకటనర్సయ్య సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలించారు. ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. వీరి వెంట చీఫ్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు ఉన్నారు.

మహిళా సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే

చిలకలూరిపేట: మహిళలు విద్యావంతులు కావాలని జీవితకాలం కృషి చేసిన తొలి మహిళా సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే అని మహాత్మ జ్యోతిరావు పూలే చైతన్య సేవా సంఘం అధ్యక్షుడు ఉప్పాల భాస్కరరావు చెప్పారు. సావిత్రీబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని గడియారస్తంభ సెంటర్‌లోని సావిత్రీబాయి పూలే, జ్యోతిరావు పూలే విగ్రహాలకు సోమవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే మహిళా ఉపాధ్యాయురాలిగా మహిళల అభ్యున్నతికి పాటుపడ్డారని వెల్లడించారు. దేశంలో తొలి బాలికల పాఠశాలలను స్థాపించారని చెప్పారు. 2023లో అప్పటి ప్రభుత్వం బీసీ భవన్ కోసం కేటాయించిన 53 సెంట్ల స్థలంలో బీసీ భవన్ నిర్మాణం చేపట్టాలని నియోజకవర్గంలోని బీసీ ప్రజలు ఎదురు చూస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కస్తూరి వెంకటేశ్వర్లు, మారుబోయిన శ్రీనివాసరావు, పోటు శ్రీనివాసరావు, ఉండవల్లి కోటేశ్వరరావు, ముద్దపాటి సుబ్బారావు పాల్గొన్నారు.

ఎంపీపీ పాఠశాలలో సావిత్రిబాయి పూలే వర్ధంతి

శావల్యాపురం: తుమ్మలకుంట గ్రామంలోని ఎంపీపీ స్కూల్లో సావిత్రిబాయి పూలె వర్ధంతి సోమవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు బిళ్ళా రాజారమేష్, ఉపాధ్యాయులు డి.రవికుమార్ సావిత్రిబాయి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.

వినుకొండ వాసికి డాక్టరేట్



వినుకొండ: వినుకొండ వాసి బొంత రాజీవ్ డిటీలో గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ నుంచి సోషల్ సర్వీస్ కేటగిరిలో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. రాజీవ్ వినుకొండలో చదువుకొని గత 11ఏళ్లుగా హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో ద సుదీర్ ఫౌండేషన్‌ను స్థాపించి 125మంది అనాథ, పేదవిద్యార్థులకు నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివిస్తున్నారు. ఈ నేపథ్యంలో బొంత రాజీవ్‌ను డాక్టరేట్ వరించింది.

వీరబ్రహ్మేంద్రస్వామి వార్షికోత్సవం



నూజెండ్ల: మండలంలోని వి.అప్పాపురం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు సోమవారం వైభవంగా నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. విశేష పూజలు చేశారు. మారేళ్ళవారిపాలెం, కొమ్మారం, నూజెండ్ల, బొప్పుడివారిపాలెం, తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటి సభ్యులు అన్నప్రసాద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఆత్మ విశ్వాసంతో కృషిచేస్తే ఉన్నత శిఖరాలు



పరీక్ష సామగ్రి అందజేస్తున్న రాష్ట్ర చైర్మన్ చేర్రెడ్డి మంజులారెడ్డి

రెంటాల(రెంటచింతల): ప్రతి ఒక్క విద్యార్థి ఆత్మ విశ్వాసంతో కృషిచేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని రాష్ట్ర శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్స్ సంస్థ చైర్మన్ చేర్రెడ్డి మంజులారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రెంటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 25 మంది విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు అవసరమైన సామగ్రిని ఆమె పంపిణీ చేసి, మాట్లాడారు. మనిషి మనస్సులో వినయం ఎంత ఎదిగితే జీవితంలో ఆ మనిషి అంత ఎదుగుతాడని పలువురు ప్రముఖ వ్యక్తుల జీవితాలను ఉదాహరణగా వివరించారు. ప్రతి విద్యార్థి కూడా కెరటాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఏవీ నాగవీరయ్య, ఉపాధ్యాయులు ఓర్సు సాగర్, జి.లింగారెడ్డి, వి.సుబ్బా రావు, పీసీహెచ్ నాసరయ్య, వెన్నా బిచ్చిరెడ్డి, జె.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ కె.పాపయ్య

జెట్టిపాలెం(రెంటచింతల): జెట్టిపాలెం ఆదర్శ పాఠశాల(ఏపీ మోడల్ స్కూల్)లో 6 వ తరగతి ప్రవేశానికి 2025–26 విద్యా సంవత్సరానికి మార్చి 31వ తేదీలోపు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కె. పాపయ్య కోరారు. సోమవారం ఆయన పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రవేశ పరీక్షలో పొందిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తారన్నారు. ఆంగ్లంలో ఉచితంగా విద్యాబోధన జరుగుతుందని ఓసీ, బీసీ కులాలకు చెందిన విద్యార్థులు 2013 సెప్టెంబర్ 1 నుంచి 2015 ఆగస్టు 31వ తేదీ మధ్యలో జన్మించి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నాలుగేళ్ల మినహాయింపు ఉంటుందన్నారు. ఏప్రిల్ 20న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్థానిక పాఠశాలలోనే ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు పాఠశాల సెల్ నంబర్ 91829 58496 సంప్రదించాలని పేర్కొన్నారు.

యోగాతో సృజనాత్మకత



యోగా చేస్తున్న విద్యార్థులు

రెంటచింతల: విద్యార్థులకు యోగ, ఏకగ్రత నియంత్రణపై శిక్షణ తరగతులు నిర్వహించడం వల్ల వారిలో జ్ఞాపకశక్తిని పెంపొందించడంతో పాటు, సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి అవసరమైన ఏకాగ్రతపై నియంత్రణ సాధించడానికి ఎంగానో దోహదపడతాయని బ్రహ్మ కుమారీస్ రాజయోగ శిక్షణ కేంద్రం సిస్టర్ బీకే అర్చన అన్నారు. సోమవారం స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో బ్రహ్మ కుమారీస్ రాజయోగ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన యోగా తరగతులలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. పరమాత్మ ఒక ప్రకాశవంత మైనదన్నారు. ఇటువంటి శిక్షణ తరగతుల ద్వారా విద్యార్థులు మానసిక ఒత్తిడిని తొలిగించుకొవచ్చని, మంచి జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు.స్కూల్ ప్రిన్సిపల్ సింహాద్రి మోహన్, తెనాలి రామకృష్ణ , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వయంజాత చిట్‌ఫండ్‌పై చర్యలు తీసుకోండి

తహసీల్దారుకు బాధితుల ఫిర్యాదు

మాచర్ల రూరల్: చిట్టీల పేరుతో 50 నెలల నగదు చెల్లించకుండా చిట్ ఫండ్ కార్యాలయాన్ని మూసివేసిన నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని చిట్ ఫండ్ బాధితులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ కిరణ్‌కు ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన పాశం పెద కృష్ణారెడ్డి, గోపవరపు నాగేశ్వరరావు ఎంపీడీఓ కార్యాలయానికి ఎదురుగా ఉన్న స్వయం జాత చిట్‌ఫండ్ ప్రైవేటు లిమిటెడ్‌లో రూ.5లక్షల చిట్టీలను రెండు పేర్లతో ప్రతి నెలా రూ. 20 వేలు చెల్లిస్తూ 50 నెలల కాలం పూర్తయినప్పటికీ నగదు ఇవ్వలేదని తెలిపారు. అడిగితే కాలయాపన చేస్తూ.. ఇప్పటికి ఐదు నెలలు దాటినా డబ్బులు చెల్లించకుండా మానసికంగా వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. చిట్‌ఫండ్ నిర్వాహకులైన తురక వెంకన్నబాబు, బడితెల శ్రీనివాసరావు, పూలా రామకృష్ణల పై చర్యలు తగు న్యాయం చేయాలని కోరారు. అలాగే లింగాపురం గ్రామంలో ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు ఎస్సీ కాలనీలోకి రాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు మాచర్ల దానియేలు, రూబేన్ ఫిర్యాదు చేశారు. గన్నవరం గ్రామంలో 9 నెలల నుంచి రేషన్ బియ్యం పంపిణీ చేయడం లేదని గాదె తాతిరెడ్డి, కంభంపాడు గ్రామంలో సర్వే ఎప్పుడు నిర్వహిస్తారని కాకర్ల శ్రీలక్ష్మి వినతి పత్రాలు అందించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఫణికుమార్ నాయక్ తదితరులున్నారు.

విద్యుత్ శాఖ దాడులు..రూ.3.70లక్షల జరిమానా



వివరాలు వెల్లడిస్తున్న విజిలెన్స్ అధికారులు

దాచేపల్లి: దాచేపల్లి మండల పరిధిలో విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. విద్యుత్ శాఖ జిల్లా పర్యవేక్ష ఇంజినీర్ సీహెచ్ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో మండల వ్యాప్తంగా తనిఖీలు చేపట్టారు. 250 మంది పైగా విద్యుత్ శాఖ సిబ్బంది ఏకధాటిగా దాడులు నిర్వహించి, విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేసి రూ. 3.70 లక్షలు అపరాధ రుసుం విధించారు. విలేకరుల సమావేశంలో ఈఈ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యానికి పాల్పడడం చట్టరీత్యా నేరమని, వినియోగదారులు న్యాయబద్ధంగా విద్యుత్ వినియోగించుకోవాలన్నారు. విద్యుత్ వాడక బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి వినియోగదారులు తోడ్పాటునందించాలని కోరారు. దాడుల్లో డీఈఈ కె.రవిగోపాల్, విరేశ్వరరావు, కోటేశ్వరరావు, ఏఈలు భగవాన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



జాతీయ రహదారి వద్ద అభయాంజనేయస్వామి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నాదెండ్ల: గణపవరం జాతీయ రహదారి వద్ద శ్రీనివాస అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ, గ్రామంలో కొలువై ఉన్న సీతాలాంబతల్లి (బొడ్డురాయి) వద్ద శివలింగ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ వలేటి హిమవంతరావు దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నుంచి బొడ్డురాయి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గణపవరం గ్రామానికి చెందిన యనమండ్ర హనుమత్‌శాస్త్రి బృందం గణపతిపూజ, పుణ్యావాచనం, దీక్షాధారణ, అఖండస్థాపన, మండపారాధన, పంచామృతాభివాసం, జలాదివాసం నిర్వహించారు. సోమవారం ఉదయం వాసుహోమం, లక్ష్మీగణపతి, నవగ్రహ, మృత్యుంజయ, రుద్రాంజనేయ స్వామి, మూలమంత్ర హోమాలు నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చుని శాస్త్రోక్తంగా హోమాలు నిర్వహించారు. ఉదయం 9.25 గంటలకు సాంప్రదాయబద్ధ మేళతాళాలతో బొడ్డురాయి వద్ద శివలింగ ప్రతిష్ఠ, అనంతరం శ్రీనివాస అభయాంజనేయస్వామి విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించి 11.58 గంటలకు ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు. ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ధనలక్ష్మీ గ్రూపు సంస్థల డైరెక్టర్ పేర్ని వీరనారాయణ, మున్సిపల్ ప్రతిపక్ష నాయకుడు గంగా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.